"ఆరేళ్ళు లోపు పిల్లలకి ప్రవేశం ఉచితం. వీళ్ళ వయసెంత?" అడిగాడు టికెట్ కౌంటర్‌లోని మళయాళం అతను ఇంగ్లీష్‌లో.

"చిన్నవాడి వయసు నాలుగు. పెద్దవాడి వయసు ఏడు. కాబట్టి రెండు టిక్కెట్లు ఇవ్వండి." డబ్బిస్తూ చెప్పాడు వెంకటేశ్వర రావు.

టిక్కెట్లిచ్చి నవ్వుతూ అడిగాడు అతను.

"మీ పెద్దబ్బాయి వయసు ఆరంటే నేను నమ్మేవాణ్ణి. బర్త్ సర్టిఫికేట్ అడగం అని మీకూ తెలుసు. మరి మీకు ముప్ఫై రూపాయలు మిగిలేది కదా?"

"నిజమే. అబద్ధం చెప్తే మీరు కనుక్కోలేరు. కాని నా కొడుక్కి నేను అబద్ధం ఆడానని తెలుస్తుంది. వాడు నిజాయితీగా జీవించాలని నా కోరిక." వెంకటేశ్వర రావు అతనికి జవాబు చెప్పాడు.

## 107. హెచ్చరిక

చావంటే భయం గల ఒకతను యముడి గురించి ఘోర తపస్సు చేసాడు. కొంతకాలానికి అతనికి యమధర్మరాజు ప్రత్యక్షం అయి 'ఏం కావాలో కోరుకో' అనగానే అతను ఇలా అడిగాడు.

"స్వామి! నేను ఎన్నటికీ చావని వరం ఇవ్వు."

"అదెలా సాధ్యం? పుట్టాక ఎవరైనా చావక తప్పదు. కాకపోతే నీ చావుకి మునుపు నీకు నాలుగుసార్లు చావు రాబోతోందని గుర్తు చేస్తాను. దానివల్ల నీ పనులన్నీ నువ్వు చక్కబెట్టుకోవచ్చు."

"సరే స్వామి."అందుకు ఒప్పుకున్నాడు అతను.

కొంతకాలానికి జ్వరం వచ్చి అతను మంచం మీద పడ్డాడు. మర్నాడు యముడు అతని ప్రాణాలని తీసుకువెళ్ళడానికి వచ్చాడు. యముణ్ని చూసి ఆశ్చర్యపోతూ అడిగాడు అతను.

"ఇదన్యాయం స్వామి! నువ్వానాడు ఇచ్చిన వరం ప్రకారం నాకు నాలుగు సార్లు చావు దగ్గరకి వచ్చిందనే హెచ్చరిక చేస్తానన్నావు. మరి మాట తప్పావే? నేను చేయాల్సిన పనులు చాలా మిగిలిపోయాయి."

"పిచ్చివాడా! నీకు మాట ఇచ్చినట్లుగానే నేను నీకు నాలుగు సార్లు హెచ్చరికలు చేసాను. వాటిని నువ్వు ఖాతరు చెయ్యకపోతే ఆ తప్పు నాది కాదు."

"నాకు నువ్వెప్పుడు చావు రాబోతోందని చెప్పావు? ఆ తర్వాత నువ్వు నాకు మళ్ళీ కనబడటం ఇదే కదా?" ఆశ్చర్యపోయాడు అతను.

"నీ జుట్టు తెల్లబడటం నా మొదటి హెచ్చరిక. నీకు బట్టతల రావడం నా రెండో హెచ్చరిక. నీ పళ్ళన్నీ వూడిపోవడం మూడో హెచ్చరిక. నాలుగోది నీ ఒంటి మీద ముడతలు రావడం. నువ్వు నేను పంపిన ఆ హెచ్చరికలని పట్టించుకోకపోతే నేనేం చేసేది?" ప్రశ్నించాడు యముడు.

## 108. హోమ ఫలం

ఓ యోగి నవరాత్రుల్లో ఓ రోజు జువ్వి చెట్టు పక్కనే శ్రీ బాలా త్రిపుర సుందరి అష్టోత్తర శత నామావళితో హోమం చేస్తున్నాడు. నకనకలాడే కడుపులతో ఇద్దరు భక్తులు గుడికి వెళుతూ ఆగి వీళ్ళని చూసి అడిగారు.

"అయ్యా! ఇక్కడ అన్నదానం ఏమైనా జరుగుతుందా?"

"జరుగుతుంది. కూర్చోండి." చెప్పి ఆ యోగి హోమాగ్నిలో వేయడానికి సిద్ధం చేసిన అన్నం కూరలని తీసి వాళ్ళకి వడ్డించాడు.

"నెమ్మదిగా తినండి. కూరలు సరిపోవని సంశయించకండి."

వాళ్ళ పక్కనే కూర్చుని కొసరి కొసరి వడ్డించాడాయన. అన్నంలోకి కూరలు సరిపోకపోవడంతో హోమంలో వేయడానికి తెప్పించిన పుట్ట తేనెని వాళ్ళ అన్నంలో వేస్తే, తడి పొడిగా కలుపుకుని తిన్నారు వాళ్ళు. తేనె వాసనకి ఈగలు వస్తే విసన కర్రతో విసిరాడు. అన్నం తింటూ వాళ్ళు తాము గుంటూరులో రిక్షాలు లాగి జీవించే వాళ్ళమని, తమ కష్టాలు తీరడానికి మల్లన్న దర్శనానికి వచ్చామని చెప్పారు.

వాళ్ళిద్దరూ తృప్తిగా తిని చేతులు కడుక్కుని వెళ్ళారు.

ఆ యాగం చేయించే పెద్దమనిషి మళ్ళీ పుట్ట తేనెని తెప్పించే ప్రయత్నం చేయడంతో యోగి ఆయనతో చెప్పాడు.